# ఎరుకోమ్మ ఎరుక!

గతం మనకు తెలుసు వర్తమానం తెలుస్తూనే ఉంది. ఇక మనకు తెలియందల్లా భవిష్యత్తు మాత్రమే! రాబోయే కాలంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలన్న కతూహలం, మానవజాతిలో అనాదికాలం నుంచీ వున్నది. భవిష్యత్కాలంలో జరుగబోయే సంఘటనలను ఫలానా ఫలానా విధంగా వుంటాయనీ, వుండవచ్చుననీ, తెలుసుకోవడం ఎలా? ఇందుగ్గాను మానవుడు అనేక మార్గాలను అవలంభించాడు. ప్రత్యేకంగా ఒక శాస్త్రాన్నే అభివృద్ధి చేశాడు. అదే జ్యోతిష శాస్త్రం.

గ్రహాలకూ, నక్షత్ర రాసులకూ, భవిషత్కాలానికీ లంకెలు వేసుకున్నాడు. ఒక వ్యక్తి జన్మ కాలాన్ని బట్టి అతని జాతక చక్రం వేసి, ఫలానా గ్రహం ఫలానా స్థానంలో ఉందిగనక, ఫలానా రకమైన ఫలితం కలగవచ్చునని ఈ శాస్త్రం చెబుతుంది. ఇలాగే హస్త సముద్రికం కూడా చేతిలో వున్న రేఖలను అనుసరించి ఆ వ్యక్తి భవిష్యత్తును చెబుతారు కొందరు. సంఖ్యా శాస్త్రం, ప్రశ్నా శాస్త్రం, గవ్వలాట, నాడీ శాస్త్రం మొదలయినవన్నీ భవిష్యత్తును తెలియజేసేవావే. ఈ కోవకి చేరిందే 'సోది'కూడా. దీన్నే 'ఎరుక చెప్పడం' అని కూడా అంటారు.

మరీ లోతు పాతులకు వెళ్ళవలసిన అవసరం లేదుగానీ - ముదు ముందు ఏం జరగనున్నదో ఇప్పుడే తెలుసుకోవడం చాలా కుతూహలంగా ఉంటుంది. ఈ కుతూహలం ఖరీదు- అవతలివారి ఆర్థిక స్థాయిని బట్టి ఉంటుంది. ఒకప్పుడైతే చక్రవర్తుల, మహారాజుల, నవాబుల ఆస్థానాల్లో జ్యోతిష పండితులుండేవారు. ఏ చిన్న పని చేయడానికైనా- ఈ పండితులను సంప్రదిస్తూ ఉండేవారు. ఇప్పటికీ, వీరి గిరాకీకి ఎలాంటి కొదువాలేదు. ప్రముఖ రాజకీయవేత్తలెందరో బహిరంగంగానూ, రహస్యంగానూ, ఈ జ్యోతిష శాస్త్రవేత్తలను సంప్రదిస్తూనే ఉన్నారు. వారి సలహాల మేరకు నడుచుకుంటూనే ఉన్నారు.

తోకల నరసమ్మకు అంత పేరు ప్రతిష్టలు లేని మాట నిజమేగానీ, ఆమె వృత్తిలో ఆమెకున్న నైపుణ్యం చెప్పుకోతగ్గదే!

"మా స్వగ్రామం నెక్కల్లు. అంటే- మా పుట్టింటి వారిది. మేం నలుగురం అప్పచెల్లెళ్ళం. నేను మూడోదాన్ని. మా అమ్మకు సోది చెప్పటం బాగా చాతనవుతుంది. ఆమెకు అమ్మవారు కనపడేది. తలచుకుంటే పూనకం వచ్చేది. ఆ పూనకంలో - ఎవరేది అడిగితే దాన్నే చెప్పేది. 'నక్కా కోటమ్మ సోది' అంటే. దానికి తిరుగులేదు" అన్నది నరసమ్మ తన తల్లిని గురించి చెబుతూ.

నరసమ్మ తండ్రి పేరు ఆదెయ్య. ఆయనకు యాభయ్ పందులుండేవి. ఆ పందుల్ని పగలంతా పొలాల గట్లమీద, ఊరివెలుపలా కాస్తుండేవాడు. అలా కాస్తూనే పందుల ఎరువును పోగు చేసేవాడు. ఆదెయ్యగారికి అంతా ఆడపిల్లలే. తొలిచూలు మగపిల్లాడు, పురిటిలోనే ఎన్నెమ్మ తగిలి చనిపోయాడు. మళ్ళీ మగ నలుసు కలగలేదు.

"మా పెద్దక్కను 'వినుకొండ' యిచ్చారు. రెండో అక్కను 'నరుకుళ్ళపాడు' ఇచ్చారు. వాళ్ళ సంసారాలు బాగానే ఉన్నాయ్యనుకోండి. మా అత్తవారిది పూర్వం ఉయ్యూరు. దాన్ని విడిచిపెట్టి పది పన్నెండేళ్ళయింది. ఇప్పుడు మేము బెజవాడలో ఉంటున్నాం" అంది నరసమ్మ.

సోదిని గురించి చెబుతూ నరసమ్మ- ఆ వృత్తికి సంబంధించిన అనేక వివరాలను తెలియజేసింది. సోదిని నమ్మడం, నమ్మకపోవడమన్నది వారి వారి ఇష్టాయిష్టాలమీద ఆధారపడి ఉంటుందన్నది.

"తిరుపతి వెంకన్నను నమ్ముతున్నవారూ ఉన్నారు. ఆ దేవుణ్ని తిడుతున్నవారూ ఉన్నారు. దీనికేం చెబుతారు? ఎవరి గురి వారిదీ!" అన్నది నరసమ్మ.

ఆమె దృష్టిలో ఇది నేర్చుకుంటే వచ్చే విద్య కాదు. దీనికొంత సంస్కారం ఉండాలి. పూర్వజన్మ పుణ్యం ఉండాలి. అడ్డమైన తిళ్లు తినేవారికీ, తాగి తందనాలాడేవారికీ ఈ విద్య పట్టు పడదు. సోది చెప్పేవారూ, నేర్చుకునేవారూ కూడా నియమంగా, నిష్టంగా ఉండాలి.

"చచ్చి ఏ లోకాన ఉందోగానీ అబ్బాయిగారూ! మా అమ్మ మహా ఇల్లాలు. ఒక్కపూటనే అన్నం తినేది. చద్దివీ, పాచిపోయినవీ ముట్టుకునేది కాదు. 'నీచు'ను దగ్గరకు రానిచ్చేది కాదు. ఇక్కడ్నే మా అమ్మా, మా అయ్యా కొట్టుకు చచ్చేవారు. మా అయ్యకు రోజూ నీచు కావాలి. మా అమ్మకు అదంటేనే పడిచావదాయె...ఆయనే వొండుకు తినేవాడు. రోజూ తాగేవాడు. చెరువు తూము మీద కూచుని, లల్లాయి పాటలన్నీ పాడేవాడు... ఆ సంగతే చెబుతామనుకుంటున్నా. మా అమ్మ బాగా సోది చెబుతుందన్నాను గదా. మా అమ్మమ్మ - ఇంకా బాగా చెప్పేదిట. మా అమ్మ పొట్టిగా, గుమ్మడి పండులాగా ఎర్రగా వుంటుంది. కాయపారు మనిషి. చిర్రుజుట్టు ఎప్పుడూ ఆముదం రాసుకునేది తలకు. చిక్కంటుతో దువ్వుకుని కొప్పు పెట్టుకునేది. ఎప్పుడూ పూలు మాత్రం పెట్టుకునేది కాదు. రూపాయంత కుంకం బొట్టు, రెండు చేతులకూ రెండు దండ కడియాలు, కాళ్ళకు కడియాలు అందెలూ వుండేవి. రెండు జతల మెట్టెలూ, పిల్లెళ్ళూ ఉండేవి. చెవులకు గుబ్బానీలు, ముక్కు బులాకీ ఉండేవి. ఎప్పుడూ ఎర్ర చీరలే కట్టుకునేది. గుత్తంగా, మోచేతుల దాకా రవికలు వేసుకునేది... ఎండలయ్యేది, రాళ్ళయ్యేది, రప్పలయ్యేది ఛస్తే చెప్పులు వేసుకునేది కాదు... ఎందుకేమిటి అబ్బాయిగారూ! ఇవన్నీ సోది చెప్పేవారికి నియమాలు" అన్నది నరసమ్మ.

తను కూడా తల్లితో పాటు ఊరూరు, ఇల్లిల్లూ తిరిగానన్నది నరసమ్మ. తన తల్లికి అసలు తీరుబాటే ఉండేది కాదన్నది.

"సంపాదనా? ఆ రోజుల్లో సోలెడు, గిద్దెడు గింజలు చాటలో పోసేవారు.... అదే చెబుతా. ఆ సోది బుట్టను ఈతాకులతో అల్లుతారు. మా అమ్మమ్మ- కఱ్ఱ కడిగిన తరువాత, ఆ బుట్టనూ, ఆ సోది పీటనూ, ఆ కఱ్ఱనూ మా అమ్మకిచ్చిందండీ! మా అమ్మ కూడా చెప్పినంతకాలం చెప్పింది. ఇక తన వల్ల కాదనుకొన్నప్పుడు కఱ్ఱకడిగి, ఆ సామానంతా నాకిచ్చిందండీ... కఱ్ఱ కడగడమంటే మరేం లేదు అబ్బాయిగారూ! 'ఇక సోది చెప్పరు' అని నిశ్చయించుకున్న తరువాత, సోది బుట్టనూ, పీటనూ, కఱ్ఱనూ పాలతో కడిగి ఆ తరువాత వారికిస్తారు. అలా ఒకసారి ఇచ్చాక- మరింక సోది చెప్పరండీ! అదో కట్టుబాటు... రోజుకు రెండు మూడిళ్ళ దగ్గర మాత్రమే మా అమ్మ చెప్పేది. అప్పటికే ఆమె బాగా అలిసిపోయేది కూడా. ఒకసారేం జరిగిందంటే, నడెండా కాలం. తిప్పి నీడ అయ్యప్పగారనీ- పెద్ద రైతండీ! ఆయనకు పదిరకాల వ్యవసాయంఉంది. గొడ్డూగోదా, జీతగాళ్ళూ వేస్తే వేయి రూపాలుగా వుండేదండీ వారి సంసారం. వారి పశువులన్నీ తోట పొలంలో వాముల దగ్గర కట్టేస్తూ వుండేవారు.

ఒకసారి వాళ్ళ చూడి ఆవు తప్పి పోయింది. ఎక్కడికి పోయిందీ ఎవరికీ అంతు చిక్కలేదు. అప్పుడేమో- అయ్యప్పగారు మా ఇంటికి ఎడ్లబండిని పంపించారు. మా అమ్మా నేను వెళ్ళాం. అయ్యప్పగారి భార్య తిరుపతమ్మగారు- మంచి తల్లి. పార్వతీ అమ్మవారికి మల్లె ఉండేది ఆమెగారు. సోదికి కూచున్నారు. మా అమ్మ అందరు దేవుళ్ళనూ, దేవతల్నీ తలచుకుంది. ఆవు పోయిన సంగతి మాకు తెలియదు గదా! అమ్మ చెప్పింది- అది తప్పిపోవడమేననీ, గో లక్ష్మి ఫలానా చోట అంగలారుస్తున్నదనీ చెప్పింది. అయ్యప్పగారు మనుషుల్ని పంపించారు అక్కడికి. వైకుంఠాపురం దగ్గర కృష్ణ ఊబిలో కూరుకుపోయి ఉందా ఆవు. నలుగురు మనుషులు మోకులేసి, బయటికి లాగి ఇంటికి తెచ్చుకున్నారు. అట్లాగే కల్లంపూడి పెదరామయ్యగారి పెద్ద కొడుకు తప్పిపోయినప్పుడు కూడా, మా అమ్మ సోది చెప్పింది. చెప్పినట్లుగానే, పదో రోజున అతనే ఇంటికొచ్చాడు...'' నరసమ్మ చెప్పడం ఆపి చెమట తుడుచుకొంది.

“దీన్నడ్డం పెట్టుకుని బతికేవాళ్ళున్నారనుకోండి. మాకా అవసరం లేదు. మా అమ్మ ఉపకారంగా మాత్రమే చేసింది. నేనూ అలాగే చేస్తున్నాను. మా అమ్మ ఊరూరూ, ఇల్లిల్లూ తిరిగింది. ఉయ్యూరులో ఉన్నప్పుడు నేనూ తిరిగానుగానండీ- ఈ బస్తీలో కుదరదు అబ్బాయి గారూ! ఇదేదో మోసమనీ, దగా అనీ అనుకుంటారు... ఇది నాకు బతుకుతెరువు కాదు. మా ఆయన లారీల కంపెనీలో పనిచేస్తుంటాడు. ఆయన సంపాదనే మాకు చాలు. కాకపోతే కుల వృత్తిని విడిచి పెట్టడమెందుకని, నా దగ్గరకొచ్చిన వాళ్ళకు మాత్రమే నేను చెబుతూ ఉంటాను'' ఇప్పటికయినా, ఆ సోలెడు గిద్దెడు గింజలూ, ఒక చిన్న పైసా తీసుకుంటాను. ఎక్కువిచ్చినా ముట్టుకోను. ఆపాటి కూడా ఇచ్చుకోలేని వారొస్తే, నేనే నా గింజలు చాటలో పోసి చెబుతా.'' అన్నది నరసమ్మ.

ఆ తరువాత తరతరాలుగా వస్తున్న తమ సోదిబుట్టను చూపించింది నరసమ్మ. అది శిథిలమయిపోయి ఉంది. లోపల పాతగుడ్డలూ, మందకంచమూ, సత్తులోటా ఉన్నాయి. అవి- వాళ్ళ అమ్మమ్మ, తన అమ్మకిస్తే- అమ్మ తనకిచ్చిన ఆస్తి- అని చెప్పింది నరసమ్మ. ఓ మూలగా చిన్న సోదిపీట ఉంది. దాన్నిండా పసుపూ, కుంకుమా, వాటిమధ్య మెరిసిపోతున్న గవ్వలూ ఉన్నాయి. ఇంకో మూలగా, చిన్న కఱ్ఱ పుడక ఉంది. దానికి అటూ ఇటూ రెండు తోరాలు వేళ్ళాడుతున్నాయి.

“ఈ విద్య - మా వంశంలో నాతోటే ఆఖరు అబ్బాయిగారూ! నాకు కూతుళ్ళు లేరు. నా కోడలేమో చదువుకున్న పిల్ల. దానికివన్నీ సరిపడవు'' అన్నది నరసమ్మ పమిటచెంగుతో సోదిపీటను తుడుస్తూ.